క్లుప్తంగా

నేడు మృత్యుంజయ హోమం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి దొంతి వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ తెలిపారు. కొంతకాలంగా గ్రామ యువకులు చనిపోతుండటంతో వేద పండితుల సూచనల మేరగా గ్రామంలో కొలువైన వేణుగోపాలస్వామి సన్నిధానంలో ఉదయం 11 గంటలకు ఈ హోమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

డీఆర్‌డీఓ శ్రీనివాస్


అంతారంలో ధాన్యం తూకం పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్ల వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని అంతారం, సామ్లా తండాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను గురువారం అదనపు డీఆర్‌డీఓ భీమయ్యతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా కొనుగోళ్లు పూర్తికాగానే ట్యాబ్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో డీపీయంలు మోహన్, ప్రకాశ్, ఏపీఓ రమేష్, ఎంటర్‌ప్రైసెస్ ఏపీయం శ్రీనివాస్, మండల ఐకేపీ ఏపీయేం ప్రేమలత, ఈసీ భగవాన్, కార్యదర్శి రవిశంకర్, సీసీలు వరలక్ష్మి, నర్మద తదితరులు పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): ఈనెల 26వ తేదీన తూప్రాన్‌లో జరిగే ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని మండల బీజేపీ అధ్యక్షుడు కమ్మరి నరేందర్ చారి కోరారు. గురువారం మనోహరాబాద్ మండల బీజేపీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుంచి భారీ ఎత్తున ప్రజలు, కార్యకర్తలు పాల్గొనేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మోర్చా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, నాయకులు ప్రభాకర్‌గౌడ్, శ్రీకాంత్, నరేష్‌గౌడ్, కుంట మహేష్, మల్లేష్, కుమ్మరి నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


హోమం చేస్తున్న సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి దంపతులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలోని శ్రీలక్ష్మీ గణపతి, దత్తాత్రేయ, ఆంజనేయ సహిత సాయినాథ ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, స్వస్తి పుణ్యాహవచనము, రక్షాబంధనము, పంచగవ్యప్రాశన, ఋత్విక్వరణము, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన తదితర పూజా కార్యక్రమాలు చేశారు. సాయంత్రం గ్రామంలో పల్లకిసేవ చేపట్టారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి


మాట్లాడుతున్న నెహ్రూనాయక్

రేగోడ్(మెదక్): నారాయణఖేడ్ బహిరంగ సభలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటాన్ని అవమానించారని గిరిజన విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు రాథోడ్ నెహ్రూనాయక్ మండిపడ్డారు. గురువారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఇప్పుడిప్పుడే బంజార జాతికి గుర్తింపు వస్తున్న తరుణంలో రేవంత్ రెడ్డి తమ జాతిని మళ్లీ అంధకారంలోకి నెట్టేస్తున్నారన్నారు. తక్షణమే ఆయన గిరిజనులను క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి పుల్ సింగ్ నాయక్, శివరాథోడ్, తదితరులు పాల్గొన్నారు

ఆ పార్టీలకు ఓట్లడిగే హక్కులేదు


మాట్లాడుతున్న రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరావు

- రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరావు

వెల్దుర్తి(తూప్రాన్): రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లకు రైతుల ఓట్లడిగే హక్కులేదని రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరావుఅన్నారు. వెల్దుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరును తీవ్రంగా ఎండగట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న అసమగ్ర వ్యవసాయ విధానాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అభివృద్ధి, ప్రాజెక్టుల పేరిట తక్కువ ధరలో రైతుల భూములను లాక్కోవడం దారుణమన్నారు. కమీషన్‌లకు కక్కుర్తి పడటం వల్లే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిందని, ఫలితంగా కాళేశ్వరం కథ కంచికి చేరనుందన్నారు. ప్రాజెక్టుల పేరుతో దోపిడీ జరుగుతున్నా కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని, రానున్న ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు తగిన గుణపాటం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కిష్టాగౌడ్, నాయకులు కృష్ణ, శంకర్‌గౌడ్, శ్రీశైలం యాదవ్, మల్లేశం యాదవ్, దుర్గాగౌడ్, శ్రీకాంత్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంప్రదాయాలపై హేళన సరికాదు

- మల్కాజిగిరిలో మైనంపల్లి పట్టు చీరలు పంచాడా?
- రాజకీయ అనుభవం లేని కాంగ్రెస్ అభ్యర్థి ఆరోపణలు విడ్డూరం
- ఎన్నికల ప్రచారంలో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి


గాజిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): తెలంగాణ ఆడపడుచుల బతుకమ్మ, బోనాలపై కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్ హేళన చేసి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండల పరిధిలోని గాజిరెడ్డిపల్లి, బూర్గుపల్లి, వాడి, కప్రాయిపల్లి, జక్కన్నపేట, సుల్తాన్‌పూర్, సర్దన, జక్కన్నపేట, చౌట్లపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పద్మాదేవేందర్ రెడ్డికి మహిళలు బోనాలు, బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభల్లో ఆమె మాట్లాడుతూ 23 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న తనపై మూడు నెలల క్రితం కూడా రాజకీయాల్లోకి రాని కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్ తెలంగాణ ఆడ పడుచులను హేళన చేసే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యేగా మైనంపల్లి హన్మంతరావు అక్కడ మహిళలకు పట్టు చీరలు పంపిణీ చేశాడా అని ఆమె ప్రశ్నించారు. ఓటమి భయంతో తనపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదని, తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోబోమన్నారు. తనను ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు మ్యాడం బాలకృష్ణ, వెంకట్‌రెడ్డి, సతీశ్‌రావు, కొంపల్లి సుభాశ్‌రెడ్డి, పడాల సతీశ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాణిక్యరెడ్డి, సర్పంచ్‌లు భాగ్య, చెన్నాగౌడ్, యామిరెడ్డి, సాయిలు, బీఆర్ఎస్ నాయకులు రాంచంద్రారెడ్డి, మేకల సాయిలు, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలి

- నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి


నర్సాపూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి, పక్కన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ రూపొందించిన పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని మంత్రి హరీశ్‌రావు సూచించారని నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంపై మంత్రి నియోజకవర్గంలోని మండలాలవారీగా సమీక్ష చేపట్టి పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారన్నారు. నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారని, తమ పార్టీ నర్సాపూర్‌లో గెలుస్తుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, సీఎంగా కేసీఆర్ మూడోసారి బాధ్యతలు చేపట్టి హ్యాట్రిక్ సాధిస్తారని మంత్రి చెప్పారని వివరించారు.

నర్సాపూర్: రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు సమక్షంలో పలువురు ఆయా పార్టీల నాయకులు గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులతో మండలాలవారీగా మంత్రి సమీక్ష చేపట్టారు. సమీక్ష అనంతరం బీజేపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ప్రసాద్, నియోజకవర్గం బీజేవైఎం కన్వీనర్ నిఖిల్‌గౌడ్‌తో పాటు ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు పార్టీలో చేరగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కొల్చారం(నర్సాపూర్): బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాల పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సునీతారెడ్డికి మద్దతుగా ఆమె కోడళ్లు కృత్తికారెడ్డి, కీర్తిరెడ్డి మండలంలోని అప్పాజీపల్లి, పోతంశెట్టిపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నమూనా బ్యాలెట్ పేపర్, ఈవీఎంలతో ప్రచారం చేశారు.

రైతుల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే

కౌడిపల్లి(నర్సాపూర్): బీఆర్ఎస్ ప్రభుత్వం రైతును రాజును చేయడంతోపాటు అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందని, ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి అన్నారు. గురువారం కౌడిపల్లితోపాటు కంచన్‌పల్లి, పాంపల్లి, సదాశివపల్లి, ధర్మాసాగర్ తదితర గ్రామాలలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాలను ఆదుకుంటున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటువేసి సునీతారెడ్డిని గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్ఎస్ శ్రేణులు గురువారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటువేసి బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డిని గెలిపించాలని ఓటర్లకువిజ్ఞప్తి చేశారు.


అప్పాజీపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న సునీతారెడ్డి కోడళ్లు కృత్తికారెడ్డి, కీర్తిరెడ్డి

గిరిజన తండాలో బీఆర్ఎస్ ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని చిప్పల్ తుర్తి పంచాయతీ పరిధిలోనీ నంద్యా, నర్సింగ్, భీమ్లాతో పాటు తదితర గిరిజన తండాల్లో గురువారం రాత్రి జెడ్పీటీసీ బాబియా నాయక్, సర్పంచ్ ఉమ్లా నాయక్, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితర నాయకులు ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

యువకుడి ఆత్మహత్య


బాబు (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మడూర్ గ్రామానికి చెందిన కాడిగల్ల బాబు(36) ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. ఇంటికి వచ్చిన తర్వాత పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటూ బయటకు వచ్చాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రశ్నించగా తాను పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య బాలమణి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తూప్రాన్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పట్టణ సమీపంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చేగుంట మండలం పోతిన్‌పల్లి గ్రామానికి చెందిన ఎరుకల స్వామి(38) తూప్రాన్ నుంచి స్వగ్రామమైన పోతిన్‌పల్లికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అయ్యప్ప దేవాయం సమీపంలో స్తంభాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

బీజేపీలోకి చేరిక

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం భీంరావుపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గురువారం బీజేపీలో చేరారు. పార్టీ నాయకుడు బోయిని భూషణం ఆధ్వర్యంలో పార్టీలో చేరి రఘునందన్ రావు గెలుపుకోసం కృషి చేస్తామని ప్రకటించారు. అనంతరం బైక్‌ర్యాలీ నిర్వహించారు.

మీ బిడ్డగా వచ్చా.. ఆశీర్వదించండి

- కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి


ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్ రూరల్: మీ బిడ్డగా వచ్చా.. ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని కోరుతూ గురువారం నర్సాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలను అర్థం చేసుకుని హస్తం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. రుస్తుంపేట, మూసాపేట, నాగులపల్లి, ఎల్లారెడ్డి గూడ తండా, రామచంద్రాపూర్, అవంచ, మాడాపూర్, తుల్జారాంపేట, ఎల్లాపూర్, గూడెం గడ్డ, కాగజ్ మద్దూర్, నత్నయపల్లి, కొండాపూర్ పలు గిరిజన తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో బీఆర్ఎస్ పదేళ్లపాటు అధికారంలో ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ గ్రామంలో గురువారం మండల కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో తమ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు ఓటర్లకు క్లుప్తంగా తెలియజేస్తున్నామన్నారు. ఓటర్లంతా మార్పు కోరుకుంటున్నారని, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజిరెడ్డి విజయం కోసం ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు పండరి, నాయకులు శంకర్‌రెడ్డి, యాదగిరి, శశిధర్‌రెడ్డి, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల భవిష్యత్ కోసం కాంగ్రెస్‌ను గెలిపించండి


వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నర్సాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజిరెడ్డి సతీమణి శైలజారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలకు బొట్టుపెట్టి కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటువేసి రాజిరెడ్డిని గెలిపించాలంటూ కోరారు. పిల్లల భవిష్యత్, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని అధికార పార్టీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు. ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు మల్లేశం, హన్మేష, పోతిరెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ ఖాయం

కొల్చారం(నర్సాపూర్): జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీ సాధించి, ఎమ్మెల్యేగా అభ్యర్థి ఆవుల రాజారెడ్డి విజయం సాధించబోతున్నారని రంగంపేట గ్రామ పార్టీ అధ్యక్షుడు గొండ కృష్ణ పేర్కొన్నారు. గురువారం రంగంపేటలో రాజిరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.

మైనారిటీలకు అండగా కాంగ్రెస్

నర్సాపూర్: ముస్లిం మైనారిటీలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఏఐసీసీ మైనారిటీ సెల్ చీఫ్ అబ్దుర్ హమ్మర్ ఇస్లాం అన్నారు. గురువారం నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డికి మద్దతుగా క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఒక్కటేనన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్ రద్దు చేస్తామని పలుసభల్లో హోంమంత్రి అమిత్‌షా ప్రకటించినా బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల నాయకులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ మైనారిటీలను ఓటు బ్యాంకుగానే చూసిందని విమర్శించారు.


నర్సాపూర్‌లో మాట్లాడుతున్న ఇస్లాం


శెట్టిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న శైలజారెడ్డి

సీఎం కేసీఆర్‌ను గెలిపిద్దాం


తూప్రాన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

తూప్రాన్: గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించడమే తమ లక్ష్యమని మున్సిపల్ కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ నీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ గడప దేవేందర్ ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, లక్ష్మణ్, దీపక్‌రెడ్డి, కాశీ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ గెలుపు ఖాయం

మనోహరాబాద్(తూప్రాన్): రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయమని, సీఎం కేసీఆర్ మూడోసారి సీఎం కావడం పక్కా అని రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన ప్రేమ్‌దాస్, ముత్యంరాజ్, భాను పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, నాయకులు నాయకుని మల్లేష్, సాయికుమార్, ధర్మేందర్, శేఖర్, రాజు, మధుగౌడ్, కృష్ణాగౌడ్, రామకృష్ణ, సత్యం తదితరులున్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

మండలంలోని రంగాయపల్లి, కోనాయపల్లి(పీటీ), చెట్లగౌరారం గ్రామాలలో తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భం వారు మాట్లాడారు. కేసీఆర్ రైతుల కష్టాలను తీర్చాడని, ఇంటింటికి కేసీఆర్ పథకం అందిందన్నారు. ధర్మరాజ్‌పల్లికి చెందిన బాగారెడ్డి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సయ్య, ఉప సర్పంచ్‌లు ధర్మేందర్, శ్రీహరిగౌడ్, నవీన్‌చారి, నాయకులు వెంకటేష్, విశాల్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ గుడి నిర్మాణానికి శంకుస్థాపన

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఏటిగడ్డ మాందాపూర్‌లో నూతనంగా నిర్మించనున్న ఎల్లమ్మ గుడి దేవాలయానికి గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మాణం చేపడుతున్నట్లు సంఘం అధ్యక్షుడు అంజా గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు లకోష్మగౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజాగౌడ్, పాపగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ఆరు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

- మాజీ రాజ్యసభ సభ్యుడు వీహెచ్ హన్మంతరావు


పెద్దశంకరంపేటలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వీహెచ్ హన్మంత్‌రావు

పెద్దశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలతో తెలంగాణలో అధికారంలోని వస్తున్నామని మాజీ రాజ్యసభ సభ్యుడు వీహెచ్ హన్మంతరావు అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలో నారాయణ ఖేడ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సంజీవరెడ్డి తరుపున ప్రచారం నిర్వహించారు. ఆరు హామీలపై వివరించి హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. బూర్గుపల్లి మాజీ సర్పంచ్ కాశీరాం వీహెచ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మధు, సర్పంచ్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల తనిఖీ

కొల్చారం(నర్సాపూర్): ఎన్నికల కోసం పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీఓ గణేష్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని వరిగుంతం, పోతంశెట్టిపల్లి, అప్పాజిపల్లి, కిష్టాపూర్, రాంపూర్ గ్రామంలోని పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేశారు. కొత్తగా అవసరమైన చోట్ల ర్యాంపుల నిర్మాణం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ వెంట ఎంపీఓ లకిష్మనారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.


వరిగుంతంలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గణేష్ రెడ్డి

వైభవంగా సత్యసాయి జయంతి


సత్యసాయికి పూజలుచేస్తున్న భక్తులు

రామాయంపేట(మెదక్): సత్యసాయిబాబా జయంతిని గురువారం రామాయంపేటలో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ యాచం శంకరయ్య ఆధ్వర్యంలో సత్యసాయి భక్తులు బస్టాండ్‌లో పులిహోరా, బిస్కట్లు పంపిణీ చేశారు. అలాగే ఝాన్సిలింగాపూర్, రామాయంపేటలోని ఆయుర్వేద ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, చీరలు పంపిణీచేశారు. రామాయంపేటలోని సత్యసాయి మందిరంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఓంకారం, సుప్రభాతసేవ, నగర సంకీర్తన, పతాకా విష్కరణ కార్యక్రమం జరిగింది. మహిళా కోఆర్డినేటర్ భూలక్ష్మి, సభ్యులు బల్ల రాజయ్య, గౌరీశంకర్, రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు పైడి భానుశేఖర్, తదితరులు పాల్గొన్నారు.